క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌సీపీడీసీఎల్–11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ ప్రకటిచారు. స్పెన్సర్ ఫీడర్ పరిధిలో చిలకలగూడ, శివాలయం, రాజా డిలక్స్, రెస్‌కోర్స్, ఎన్‌బీకే ఎస్టేట్, చర్చ్ గల్లీ, దయారా మార్కెట్ ఫీడర్ పరిధిలో దయారామార్కెట్, రిసాల, సాగర్‌లాల్ హాస్పిటల్, హరినగర్, తాడి కంపౌండ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు, పార్శిగుట్ట ఫీడర్ పరిధిలో గంగపుత్ర కాలనీ, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, గ్రేవియార్డ్స్, పార్శిగుట్ట తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం

ముషీరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసేందుకు నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు, నాయకుల సమావేశాన్ని నేడు ఉదయం 10 గంటలకు కషీష్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రకటించారు. ఈ సమావేశానికి సీనియర్ నాయకులు, బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ సభ్యులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ కమిటీ సభ్యులు, మైనార్టీ, బీసీ, ఎస్సీ, సోషల్ మీడియా కమిటీ సభ్యులు హాజరుకావాలని కోరారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్, ఎన్నికల ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ ప్రభాకర్, ముఠా జైసింహ తదితరులు హాజరవుతున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మెరుగైన వైద్యం కోసం వినతి

లిబర్టీ: ప్రజా వైద్యంను మరింత బలోపేతం చేసి, ప్రజలు ముఖ్యంగా పేదలకు మెరుగైన వైద్యంను అందజేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావుకు ఉస్మానియా జేఏసీ నాయకులు దళిత బహుజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వి.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావుని కలిసి పూల మొక్క అందించి శాలువాతో సత్కరించారు. క్షేత్రస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రజా వైద్యాన్ని మరింత బలోపేతం చేయటంతో పాటు పేద మధ్య తరగతి అనగారిన వర్గాకు దళితులకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ... ఇప్పటికే ప్రాథమిక ఆసుపత్రి నుంచి పట్టణ ఆసుపత్రుల వరకు ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

నేడు బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌ల సమావేశం

నాగోలు: నాగోలు డివిజన్ బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు సమావేశంలో గురువారం సాయంత్రం 5 గంటలకు డివిజన్ పరిధిలోని శుభం కన్వెన్షన్‌లో నిర్వహిస్తామని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎల్‌బీనగర్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌ఛార్జి, కర్ణాటక ఎమ్మెల్యే మునిరత్నం నాయకులు, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి పాల్గొంటారని వారు తెలిపారు. సమావేశంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ బూత్ అధ్యక్షుడు, పార్టీ నాయకులను దిశానిర్దేశం చేస్తారన్నారు. పార్టీ నాయకులు, బూత్ ఇన్‌చార్జ్‌లు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని సూచించారు.

డీసీపీ కార్యాలయాన్ని సందర్శించిన నగర సీపీ

సైదాబాద్: సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయాన్ని నగర పోలీస్ కమిషనర్ సందర్శించారు. సైదాబాద్ చౌరస్తాలోని డీసీపీ కార్యాలయానికి బుధవారం చేరుకున్న సీపీ సందీప్ శాండిల్యా జోన్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితిపై డీసీపీ రోహిత్ రాజును ఆరా తీశారు. జోన్‌లోని రౌడీషీటర్ల కదలికలపై తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తోంది. డీసీపీ కార్యాలయంలో గంటన్నర సేపు ఉన్న కమిషనర్ జోన్ పరిధిలో జరుగుతున్న అన్ని వ్యవహారాలపై పూర్తి వివరాలు సేకరించినట్లు సమాచారం.

నాగదేవత గుడిలో హుండీలు చోరీ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 1లోని నాగదేవత గుడిలో హుండీలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు ఆలయ ప్రతినిధి రాయ్‌కోడ్ రమేష్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసుల సమాచారం మేరకు... రోడ్ నెం 1లో ఉన్న నాగదేవత టెంపుల్‌లోకి ఈ నెల 24వ తేదీ అర్ధరాత్రి ఇద్దరు ఆగంతకులు ప్రవేశించి గేటు బద్దలకొట్టి లోనికి ప్రవేశించి రెండు హుండీలను ఎత్తుకెళ్లారు. నెలన్నరకు సంబంధించిన హుండీ ఆదాయం ఈ రెండు హుండీల్లో ఉందని సుమారుగా రూ. 20 వేల వరకు భక్తులు వేసిన నగదు చోరీ అయిందని ఆరోపించారు. సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. నలుపు రంగు దుస్తుల్లో ఉన్న ఇద్దరు వ్యక్తులులోనికి ప్రవేశించి హుండీలు ఎత్తుకెళ్లే దృశ్యాలను పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి నేతలున్నా జాప్యం

- అంబర్‌పేట్ నియోజకవర్గంలో జాతీయ పార్టీల్లో రాని స్పష్టత
- బీజేపీకి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్‌కు వీహెచ్ అభ్యర్థి ఖరారుపై గందరగోళం

అంబర్‌పేట: జాతీయ స్థాయి నేతలున్నా జాతీయ పార్టీలు ఇప్పటికీ అంబర్‌పేట నియోజకవర్గం అభ్యర్థిని ప్రకటించకపోవడం శోచనీయం. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ఎవరు అభ్యర్థి అన్నదానిపై స్పష్టత లేకపోవడంతో ఆ పార్టీల నేతలు, కార్యకర్తలు ఉత్కంఠకు గురువుతున్నారు. అధికార పార్టీ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే ఖారారు కావడంతో ఆ పార్టీ ఇప్పటి వరకు ప్రచారంలో ముందు వరుసలో ఉంది. దీనికి భిన్నంగా జాతీయ పార్టీల అభ్యర్థులపై స్పష్టత లేకపోవడం కొంత గందరగోళ పరిస్థితులు ఉన్నాయి. బీఆర్‌ఎస్ విస్తృత ప్రచారం చేస్తుంటే బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు ప్రేక్షుల్లాగా చూడాల్సి వస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

కంచుకోటగా బీజేపీ..

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన అంబర్‌పేటలో బీజేపీని కుంచుకోటగా మార్చారు. రాష్ట్రంలోనే బీజేపీ ఖాతాలో అంబర్‌పేట ఉంటుందని అంతా భావిస్తారు. తాజాగా గత ఎన్నికల్లో కిషన్‌రెడ్డి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలైనా.. ఎంపీ ఎన్నికల్లో అంబర్‌పేటలో తిరుగులేని మెజారిటీ వచ్చింది. దీంతో అంబర్‌పేటలో బీజేపీకి తిరుగు లేదని స్పష్టమైంది.

మొదటి జాబితాలో లేని నియోజకవర్గం..

అభ్యర్థి ఖారారులో జాప్యం జరుగుతుండటం పట్ల అంతా అవాక్కవుతున్నారు. బీజేపీ విడుదల చేసిన మొదటి జాబితాలో అంబర్‌పేట లేకపోవడంతో నియోజకవర్గం పార్టీ శ్రేణులు నిరుత్సాహానికి గురవుతున్నారు. జాతీయ స్థాయి, రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కిషన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో అభ్యర్థి ఖరారులో జాప్యం జరగడం చర్చనీయాశంగా మారింది.

కాంగ్రెస్‌ది ప్రతిసారి ట్విస్ట్..

- అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి గాడ్‌ఫాదర్‌గా జాతీయ నాయకుడిగా చలామణి అవుతున్న వి.హనుమంతరావు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు పార్టీ అభ్యర్థి ఖారారు కాకపోవడం గమనార్హం.
- ప్రతిసారి ఎన్నికల్లో అంబర్‌పేట నుంచి పోటీ చేయడానికి ఉత్సాహం ఉన్న నేతలు ఆసక్తి చూపినప్పటికీ వీహెచ్ వారిని ఎలా తప్పించి, ఎవరికి ఎలా ఇవ్వాలని.. తనదైన శైలిలో రాజకీయం చేస్తూ వస్తుంటారు. ఎవరి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తారో ఎవరికి అంతుపట్టదు.
- నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు సైతం వీహెచ్ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉంటారు. పార్టీ నిబద్ధత కార్యకర్తలకు ఉన్నప్పటికి వీహెచ్ రాజకీయంతో అంతా నిరాశతో పక్కా పార్టీ వైపు చూస్తుంటారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై స్పష్టత ఇవ్వాలని ఆ పార్టీ శ్రేణులు అధిష్టానాన్ని కోరుతున్నారు.

ముగిసిన సాయిబాబా పుణ్యతిథి మహోత్సవం


సాయి బాబా రథయాత్ర దృశ్యం

నల్లకుంట: బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మంధిరంలో ఈ నెల 22న ప్రారంభమైన శ్రీ షిరిడీ సాయిబాబా 105వ పుణ్యతిథి మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. మంగళవారం రాత్రి సాయిబాబా నగర్, డీడీ కాలనీల మీదుగా భక్తుల కోలాహం మధ్య సాయిబాబా రథ యాత్ర అత్యంత వైభవంగా సాగింది. చివరిరోజున ఉదయం బాబాకు కాకడా హారతి ఇచ్చి బాబా మూల విరాట్‌కు అభిషేకం చేసి బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ సాయి సహస్రనామార్చన, శ్రీ సాయి సచ్ఛరిత్ర పఠనం జరిగింది. ఉదయం పేదలకు అన్నదానం చేశారు. సాయంత్రం బాబాకు ధూప్ హారతి, భజన అనంతరం బాబాకు ఊయల సేవ నిర్వహించారు. రాత్రి శేజ్ హారతితో మహోత్సవాలు ముగిశాయి.

‘నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం’


అనిల్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి శూన్యమని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. బుధవారం అడిక్‌మెట్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్లల్లో కాన్సిస్‌టెన్సీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (సీడీపీ) నిధులను ఎమ్మెల్యే రూ. 2.90 కోట్లను మాత్రమే ఖర్చు చేసినట్లు ఆధారాలు ఉన్నాయని, మాటలు కోటలు దాటుతున్నాయని ఎద్దేవ చేశారు. నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయని నిత్యం డ్రైనేజీ, కలుషిత తాగునీటి సరఫరా, గుంతలమయమైన రోడ్లు దర్శనమిస్తున్నాయన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో కమ్యూనిటీ హాల్స్, సీసీరోడ్లు, విద్యుత్‌లైన్లు, డ్రైనేజీ పైపులైన్లు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయని ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఎంతో ఆతృతతో ఉన్నారని తెలిపారు.


రౌడీషీటర్లతో ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్

రౌడీషీటర్ల బైండోవర్

ముషీరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ సందీప్‌శాండిల్య ఆదేశాల మేరకు ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 20 మంది రౌడీషీటర్లను సికింద్రాబాద్ ఆర్డీఓ ఎదుట బుధవారం బైండవర్ చేశారు. అంతకు ముందు ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీట్ ఓపెన్ అయిన వారు ఏ పార్టీకి మద్దతుగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, భయపెట్టడం చేయవద్దని సూచించారు. మీమీ సెక్టార్ ఎస్సైలు, బీట్ కానిస్టేబుళ్లు ఎప్పుడు పిలిచిన పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకం పెట్టి పోవాలని హెచ్చరించారు. పోలీసులకు తెలియకుండా సుదూర ప్రాంతాలకు వెళ్లవద్దని ఫోన్ నెంబర్లు, ఇంటిని మార్చవద్దని ఒకవేళ మారిస్తే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రస్తుతం మీమీద ఉన్న కేసుల విషయంలో కోర్టుకు అటెండ్ కావాలని, ఏ చిన్న పెట్టీ కేసులో కలగచేసుకున్నా.. వెంటనే కేసు నమోదు చేసి తహసీల్దార్, ఆర్డీఓల ఎదుట హాజరుపరుస్తామని వారికి లక్ష నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు.

అదనపు విధులా.. డుమ్మా కొడుతున్నారా ?

- సికింద్రాబాద్ బల్దియాలో నిలిచిపోతున్న పౌర సేవలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



సికింద్రాబాద్: సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో పౌర సేవలు నిలిచిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు వెలువడింది మొదలు జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం కార్యాలయంతోపాటు సికింద్రాబాద్, బేగంపేట సర్కిల్ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది కార్యాలయాలకు రాక పలు విభాగాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. అదనపు విధులు, క్షేత్రస్థాయి పర్యటనల పేరిట అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండడం లేదు. ఏ విభాగానికి వెళ్లి ఆరా తీసినా ఉద్యోగులు, అధికారులు అదనపు ఎన్నికల విధుల పేరుతో కార్యాలయాలకు రావడం మానేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు కొందరు అధికారులు, ఉద్యోగులు బదిలీలపై వెళ్లిపోయారు. ఇంకొందరు పదవీ విరమణ చేశారు. ఆయా స్థానాల్లో నియామకాలు జరుగలేదు. ఫలితంగా జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగుల కొరత ఏర్పడింది. కరోనా పరిస్థితుల అనంతరం జీహెచ్‌ఎంసీ ఉద్యోగులకు, అధికారులకు అదనపు పనుల భారం పెరిగిన మాట వాస్తవమే అయినా.. అదనపు విధుల పేరుతో అందుబాటులో ఉన్న పరిమిత సంఖ్యలోని అధికారులు, ఉద్యోగులు విధులకు ఎగనామం పెడుతున్నట్టు సమాచారం. ఫలితంగా పౌర సేవలు ఆసాంతం కుంటుబడుతున్నాయి.

పత్తలేని ప్రత్యామ్నాయం..

వివిధ అవసరాల నిమిత్తం జీహెచ్‌ఎంసీ కార్యాలయం చుట్టూ ప్రజలు పలుమార్లు ప్రదక్షణలు చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. టౌన్‌ప్లానింగ్, పన్నుల విభాగం, ఇంజినీరింగ్ వంటి ప్రధాన విభాగాల అధికారులు, సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉండడం లేదని ఆయా అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి సికింద్రాబాద్ సర్కిల్ పరిధి, జనాభా ఎక్కువగా ఉందన్న కారణంతో రెండుగా విభజించి కొత్తగా బేగంపేట సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. పరిపాలనా వికేంద్రీకరణ పేరుతో సర్కిల్‌ను విభజించినప్పటికీ ఎనమిదేళ్లుగా ప్రజాసేవల విస్తరణలో రెండు సర్కిల్ కార్యాలయాలు సాధించిన ప్రగతి ఎంత మాత్రం లేదు. సికింద్రాబాద్ నుంచి కొన్ని ప్రాంతాలను వేరుచేసి బేగంపేట సర్కిల్‌ను కొత్తగా ఏర్పాటు చేసిన అధికారులు అందుకు అవసరమైన సిబ్బందిని మాత్రం కేటాయించలేదు. ట్యాక్స్, పట్టణ ప్రణాళిక, జనన, మరణ ధృవీకరణజారీ, వివిధ అభివృద్ధి పనుల విభాగాల్లో ఈ సమస్యలు తీవ్రంగా ఉంటున్నాయి. అదనపు విధులు ఉన్న సందర్భాల్లో ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు పేర్కొంటున్నప్పటికీ ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదు. అదనపు విధులు ఉన్నప్పటికీ ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆకట్టుకున్న సంగీత కచేరి

నల్లకుంట: శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరిలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తి సంగీత కచేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా రేడియో కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణమూర్తి, వర్ధమాన గాయిని నందినిలు ఆలపించిన భక్తి గీతాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. దీనికి గౌరీభట్ల వసుధామూర్తి మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు గాత్ర సహకారమందించగా.. కీ బోర్డుపై యామిని వాద్య సహకారం అందించారు.


భక్తి గీతాలు ఆలపిస్తున్న గౌరీభట్ల లక్ష్మణామూర్తి

‘బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతో ప్రత్యర్థుల్లో వణుకు’

లిబర్టీ: అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నిక మెనిఫెస్టో నిలుస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సబండ వర్గాల సమగ్ర అభివృద్ధి ఆర్థిక ప్రగతి కోసం ఎన్నికల ప్రణాళికలు అనేక అంశాలను పొందుపరిచారన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... భారత రాష్ట్ర సమితి విడుదల చేసిన ఎన్నికల ప్రణాళికను చూసి కాంగ్రెస్, బీజేపీ ఇతర రాజకీయ పార్టీలకు వణుకు పుడుతోందన్నారు. అన్ని పార్టీలో ఓటమి తప్పదని భయం స్పష్టంగా కన్పిస్తోందన్నారు. ఎన్నికల ప్రణాళికను చూసిన తరువాత తమ ఓటమి దగ్గరలోనే ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి నిమజ్జనం

దిల్‌సుఖ్‌నగర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగియడంతో బుధవారం మలక్‌పేట జోన్ పరిధిలోని మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఉత్సవాల ముగింపు నేపథ్యంలో దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్, మలక్‌పేట, కుర్మగూడ, చాదర్‌ఘాట్, ఆర్‌కేపురం, సలీంనగర్ తదితర ప్రాంతాల్లోని ఆలయాలు, దుర్గాదేవి మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారిని పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ, పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పులిహోర, దద్ధోజనం, శనగలు, రవ్వ కేసరి, పరమాన్నంతో పాటు వివిధ రకాల వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. అన్ని ప్రాంతాల్లోని దుర్గామాత విగ్రహాల నిమజ్జన ఊరేగింపులు కొనసాగాయి. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఆలయాల నిర్వాహకులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఓయూ ప్రొఫెసర్‌కు లీడర్‌షిప్ అవార్డు



అవార్డును అందుకుంటున్న ప్రొ. ఉమామహేశ్వర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొ.ఉమామహేశ్వర్ లీడర్‌షిప్ అవార్డు అందుకున్నారు. ఇటీవల చెన్నైలో జరిగిన సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజినీర్స్ ఇండియా(ఎస్‌ఏఈ) వార్షిక అవార్డుల కార్యక్రమంలో ఆయనకు లీడర్‌షిప్ అవార్డును ప్రదానం చేసి సన్మానించారు. ఎస్‌ఏఈ ఇండియా హైదరాబాద్ డివిజన్‌కు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రొ.ఉమా మహేశ్వర్ గతేడాది కూడా ఇదే అవార్డును అందుకోవడం విశేషం.

దుర్గామాత లడ్డూ వేలం

– రూ.3.90 లక్షలు పలికిన లడ్డూ ప్రసాదం


లడ్డూను దక్కించుకున్న శివకుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: నియోజకవర్గం వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెమిని కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత లడ్డూను బుధవారం వేలం వేశారు. ఈ వేలం పాటలో స్థానికుడు గంట శివకుమార్ రూ.3.90 లక్షలకు దక్కించుకున్నారు. అమ్మవారికి సమర్పించిన రెండు పట్టుచీరలను మరో భక్తుడు బోస్‌మోన్ సంతోష్ రూ.76 వేలు, మరో పట్టు చీరను రూ.73 వేలకు మురళి వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా లడ్డూ దక్కించుకున్న గంట శివకుమార్‌ను బీఆర్‌ఎస్ యువనాయకుడు ముఠా జైసింహ, అసోసియేషన్ చైర్మన్ నవీన్‌కుమార్ డింబా, అధ్యక్షులు బోస్‌మోన్ మహేష్‌కుమార్‌లు సన్మానించి 10 గ్రాముల బంగారాన్ని బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఏటా దేవీ నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు.

- ఈసారి అమ్మవారి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూను వేలం వేయగా.. పెద్ద ఎత్తున దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారన్నారు.
- స్థానికంగా ఉన్న చేపల మార్కెట్‌ను అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే ముఠా గోపాల్ రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించాలని, తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి పూజలు చేశామన్నారు. వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సతీష్, కోశాధికారి గాండ్ల అనిల్‌కుమార్, సభ్యులు శివప్రసాద్, మోహన్‌రాజ్, శ్రీకాంత్, నరేష్, క్రాంతి, సురేష్, రవి, నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి తదితరులున్నారు.

ఆత్మీయ కలయిక అలయ్‌బలయ్


కార్పొరేటర్ పావనీని అభినందిస్తున్న బండారు దత్తాత్రేయ

చిక్కడపల్లి: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్మన్ బండారు విజయలక్ష్మి నిర్వహించిన కార్యంక్రమంలో గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బుధవారం కలసి అభినందనలు తెలిపారు. రాజకీయాకతీతంగా అన్ని వర్గాల ప్రజల ఆత్మీయ కలయికనే అలయ్‌బలయ్ అని దత్తాత్రేయ అన్నారని పావని వినయ్‌కుమార్ తెలిపారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, శివాజీ, ఉమేష్, లక్ష్మణ్‌యాదవ్, ఆనంద్, శివకృష్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

‘హెబ్రోన్’ పేరుతో అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు


వివరాలను వెల్లడిస్తున్న పీటరాచారి

చిక్కడపల్లి: క్రైస్తవులకు పవిత్రమైన ‘హెబ్రోన్ సంస్థ’ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ‘ది సొసైటీ ఆఫ్ ఇండిజినెస్ ఇన్ ఇండియా’ బ్రదర్ జోసెఫ్ కురియన్, సొసైటీ అధికార ప్రతినిధి, ప్రధానకార్యదర్శి ఆర్.వీరాచారి హెచ్చరించారు. బుధవారం గోల్కొండ క్రాస్ రోడ్స్‌లోని హెబ్రోన్ చర్చిలో ఆయన మాట్లాడారు. దేశంలోని వేలాది క్రైస్తవ సంఘాలను నిర్వహిస్తున్న హెబ్రోన్ చర్చ్‌ను బ్రదర్ భక్తసింగ్ గోల్కొండ క్రాస్ రోడ్స్‌లో ది సొసైటీ ఆఫ్ ఇండిజినెస్ చర్చెస్ ఇన్ ఇండియా పేరుతో ఒక మంచి ఆశయంతో 1971లో ఏర్పాటు చేస్తే కొందరు ఈ సంస్థను, చిరునామాను కూడా తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం అక్రమంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ ట్రస్ట్ అనేది ఈ చిరునామాలో పనిచేయడం లేదని స్పష్టం చేసారు. కేఎం. శ్యాంసన్, బానోతు భీమా ఆలియాస్ బర్నబాస్, ట్రస్ట్ సభ్యులు కొందరు తమ ఆధార్ కార్డులతో సొసైటీ చిరునామాను అక్రమంగా వాడుకుంటున్నారన్నారు. అక్రమంగా గ్యాస్ కనెక్షన్‌లు తీసుకుని నేరేడుచర్ల, విద్యానగర్‌లోని బృందావన్ కాలనీలోని సీయోను ప్రార్థనా మందిరంలో ఉంటున్నారన్నారు. ఇదే అంశంపై ముషీరాబాద్ పోస్టు ఆఫీస్, గ్యాస్ ఏజెన్సీ, పోలీసులు, తహసీల్దార్ అధికారులకు వివరించామన్నారు. చర్చ్ సభ్యులు మరోసారి మోసపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

కళలతో చిన్నారుల్లో సృజనాత్మకత



ఆర్ట్ ద్వారా ఎలా సృజనాత్మక పెంచుకోవచ్చో చూపుతున్న గీతా భాస్కర్

పంజగుట్ట: చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కళలు ఎంతో దోహదం చేస్తాయని ప్రముఖ విజువల్ ఆర్ట్స్ ఉపాధ్యాయురాలు, సినీ నటి గీతా భాస్కర్ అన్నారు. పాఠశాలల్లో 40 నిమిషాలు డ్రాయింగ్ క్లాస్ ఉంటుందని కాని దాన్ని సక్రమంగా వినియోగించుకోవడంలేదని అభిప్రాయపడ్డారు. టెంపర్‌వెరీ బుక్స్ ఇచ్చి పాత బొమ్మలు చూపుతూ వాటినే తిరిగి వెయ్యమంటున్నారని, అలా కాకుండా పిల్లల్లో క్రియేటివిటీ పెంచేందుకు ప్రయత్నించాలన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... డ్రాయింగ్‌తో అన్ని రకాల సబ్జెక్టులు బోధించవచ్చునని పిల్లలకు మరింత మెదడుకు ఎక్కే అవకాశం ఉంటుందన్నారు. ఇండియన్ ఫైన్ ఆర్ట్ అండ్ మిడియా ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా ప్రత్యేక కోర్సును ప్రారంభించినట్లు దీనితో విద్యార్థుల్లో అంతర్లీనంగా సృజనాత్మకత వెలికితీయడంలో ఎంతో దోహదపడుతుందన్నారు. ఇప్పటికే నగరంలో పలు పాఠశాలల్లో ఈ కోర్సు విజయవంతంగా సాగుతుందని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు సాధించవచ్చునని తెలిపారు.

మాస్టర్ ట్రైనర్స్‌కు అవగాహన



మాట్లాడుతున్న ఖైరతాబాద్ ఎన్నికల అధికారి వెంకటేష్ దోత్రే

బంజారాహిల్స్: పోలింగ్ రోజున పోలింగ్ బూత్‌లలో విధులు నిర్వహించే ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇచ్చే మాస్టర్ ట్రైనర్స్ సమావేశంలో బుధవారం ఖైరతాబాద్ ఎన్నికల కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గం రిటరి్నంగ్ అధికారి వెంకటేష్ దోత్రే ఎనిమిది మంది మాస్టర్ ట్రైనర్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ... ఈ నెల 27, 28 తేదీల్లో బంజారాహిల్స్‌లోని ముఫకంజ కాలేజీలో పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రెండు రోజుల పాటు నాలుగు సెషన్లలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. మొత్తం 800 మంది ఎన్నికల సిబ్బందికి ఇచ్చే ఈ శిక్షణలో పోలింగ్‌కు సంబంధించి సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందని సందేహాల నివృత్తి కూడా చేస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌వోలు ప్రశాంతి, అనితారెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

‘ఆయుష్మాన్ భారత్’తో పేదలకు ఎంతో మేలు


కొత్తపేటలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ కార్డులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

నాగోలు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం వల్ల నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతుందని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ ఫేజ్–1లో, శివమ్మనగర్ కాలనీలో ఆయుష్మాన్ భారత్ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారందరికీ బుధవారం పవన్ కుమార్ చేతుల మీదుగా నూతన డిజిటల్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చి ఆసుపత్రిలో చేరితే ఆయష్మాన్ భారత్ కార్డు ద్వారా కేంద్రం వారికి రూ. 5 లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో భరత్‌నగర్ కాలనీ ఫేజ్–1 అధ్యక్షుడు కొర్లపల్లి స్వామి, మంచి రాజేష్ పాల్గొన్నారు.